## క్లుప్తంగా

### ఎరుకల సంక్షేమ సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక



ఎరుకల సంక్షేమ సేవా సంఘం మండల కమిటీ

పాలకోడేరు: పాలకోడేరు మండలం ఎరుకల సంక్షేమ సేవా సంఘం నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. రిజిస్ట్రేషన్ నెంబర్ 489/2015 కలిగిన ఎరుకల సంక్షేమ సేవా సంఘానికి నూతన అధ్యక్షుడిగా కుర్ర గోవింద్, ఉపాధ్యక్షుడిగా సాలా చిన్న, ప్రధాన కార్యదర్శిగా మానుపాటి పెద్దిరాజు, కమిటీ సభ్యులుగా బెల్లంకొండ కృష్ణ, కుతడి కిషోర్, సాలా మాసరియ్య, కుతడి శ్రీను, బండారి సత్తిబాబు, దేవరకొండ భోగేశ్వరరావులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సాలా మల్లేశ్వరరావు, బెల్లంకొండ చిన్నబాబు, బండి రుద్రయ్య, సాల పండు, మానుపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా చండీహోమం



అమ్మవారి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో మావుళ్లమ్మ ఆలయంలో శనివారం పౌర్ణమి సందర్భంగా చండీహోమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. 72మంది దంపతులు ఈ హోమంలో పాల్గొన్నారని ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు.

### దుర్గమ్మకు విశేష పూజలు



విశేష అలంకరణలో కనకదుర్గమ్మ

భీమవరం (ప్రకాశం చౌక్): పౌర్ణమి సందర్భంగా శ్రీరాంపురం రోడ్డులోని కనకదుర్గ అమ్మవారికి శనివారం 50 వేల గాజులతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఆలయ కమిటీ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు బ్రహ్మజ్యోసుల సుబ్రహ్మణ్యం, ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు పితాని సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు జోషుల మల్లికార్జున్ రావు, కార్యదర్శి ఉన్న రంగారావు, కోశాధికారి ఏలూరి శివాజీ, జాయింట్ సెక్రెటరీ గండికోట వీరాస్వామి భక్తులు పాల్గొన్నారు.

### ఘనంగా స్వామివారి కల్యాణం



స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణంలోని జెపి రోడ్డులో దంతులూరు జగన్నాథరాజు సత్రం అనుబంధ సంస్థ శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం శ్రవణా నక్షత్రం పురస్కరించుకొని శ్రీవారికి శాంతి కల్యాణ మహోత్సవం జరిపించారు. వంశపారంపర్య ధర్మకర్త మంతెన రామ కుమార్ రాజు, ఈవో ముదునూరు సత్యనారాయణ రాజు, భక్తులు పాల్గొన్నారు.

### బాలా త్రిపుర సుందరీ అమ్మవారికి వెండి సమర్పణ



అమ్మవారికి వెండి అందచేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పౌర్ణమిని సందర్భంగా భీమవరం మెంటేవారి తోటలోని బాలా త్రిపుర సుందరీ అమ్మవారి వెండి మకర పీఠానికి శనివారం దాతలు 108 గ్రాముల వెండి విరాళంగా అందజేశారు. పట్టణానికి చినిమిల్లి ఆదినారాయణ, లక్ష్మి దంపతులు 108 గ్రాముల వెండిని ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి దాతలకు ఆశీర్వచనాలు అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

### రక్తదాన శిబిరం

పాలకొల్లు సెంట్రల్: సినీ హీరో మహేష్‌బాబు పుట్టిన రోజు వేడుకలను ఆయన ఫ్యాన్స్ శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మారుతి థియేటర్‌లో 50 మంది అభిమానులు రక్తదానం చేశారు. డాక్టర్ మిథున్ చౌదరి కొఠారి, మేడికొండ శ్రీనివాసరావు, వాడ్రేవు శ్రీనివాసరావు, పినిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు

**కనిపించని చెత్త సేకరణ**

- నిరుపయోగంగా ఎస్‌డబ్ల్యూ పీసీ కేంద్రాలు
- మందుబాబులకు నిలయాలుగా మారిన వైనం
- కేంద్రాల వైపు కన్నెత్తి చూడని కార్మికులు
- పట్టించుకోని అధికారులు



గరగపర్రులో నిరుపయోగంగా డంపింగ్ యార్డ్



కొండేపూడిలో వినియోగంలో లేని ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం



వేంద్రలో శిథిలావస్థకు చేరిన దృశ్యం



వేంద్రలో ప్రధాన రహదారి ప్రక్కనే చెత్తను డంప్ చేసి కాల్చుతున్న దృశ్యం

పాలకోడేరు: చెత్తతో వర్మి కంపోస్ట్ తయారుచేసి విక్రయించడం ద్వారా పంచాయతీలు అదనపు ఆదాయం పొందాలని ఉద్దేశ్యంతో చెత్త సంపద కేంద్రాలు ఏర్పాటు చేశారు. పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లో చెత్తసేకరణ సక్రమంగా సాగడం లేదు. దీంతో చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. లక్షల ప్రజాధనం వృథా అవుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో వెలువడే తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి ఎరువులు తయారు చేయాలను ఉద్దేశ్యంతో చెత్త సంపద కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉండి నియోజకవర్గంలో ఆకివీడు, పాలకోడేరు, ఉండి, కాళ్ల మండలాల్లో గాను 10 గ్రామాల్లో మినహా మిగిలిన 60 పంచాయతీల్లో సంపద కేంద్రాలు నిర్మించారు. ఒక కేంద్ర నిర్మాణానికి రూ. 5 లక్షల వరకు ఖర్చు చేశారు. వీటితోపాటు కొన్ని కంపోస్టు పిట్ల నిర్మాణం చేపట్టారు. నియోజకవర్గంలో రూ .15 లక్షలతో కొన్నిచోట్ల కంపోస్ట్ పిట్ల నిర్మాణాలను నిర్మించారు. గ్రామాల్లో చెత్తను సేకరించేందుకు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లోనూ 262 మంది కార్మికులు ( గ్రీన్ అంబాసిడర్ల)ను నియమించారు. వారికి ప్రతినెల రూ.10వేలు గౌరవ వేతనం ఇస్తున్నారు. వారు ప్రతి ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్త సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలి. అక్కడ బాటిల్ ఇతర వస్తువులు వేరు చేసి కంపోస్టు పిట్లలో చెత్తను వేసి వాటి ద్వారా వర్మికంపోస్టు తయారు చేయాలి. రైతులకు విక్రయించాలి. ఎక్కడా ఈ పనులు జరగడం లేదు. కార్మికులు ఎక్కడా చెత్తను సేకరించడం లేదు. దీంతో చెత్త సంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ఎస్‌డబ్ల్యూయు పీసీ కేంద్రాలు మందుబాబులు, పశువులకు నిలయాలుగా మారాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

**గ్రీన్ అంబాసిడర్‌లతో పారిశుద్ధ్య పనులు**

నియోజకవర్గంలోనే చెత్తను సేకరించేందుకు నియమించిన గ్రీన్ అంబాసిడర్లను అధికారులు డ్రెయినేజీ, ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రం చేయడం వంటి పనులకు వినియోగించుకుంటున్నారు. నియోజకవర్గంలో పాలకోడేరు మండలంలో విస్సాకోడేరు, గొరగనమూడి, కాళ్ళ మండలంలో ఏలూరుపాడు, ఆకివీడు మండలంలో సిద్దాపురం, ఉండి మండలంలో మహదేవపట్నంలో ఎస్ డబ్ల్యూ పీసీ కేంద్రాలను అరకొరగా వినియోగిస్తున్నారు. మరి ఎక్కడ వినియోగించడం లేదు. గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోవడంతో దుర్గంధం వెదజల్లుతుంది. పాలకోడేరు మండలంలో మేజర్ పంచాయతీలైన మోగల్లు, శృంగవృక్షం పెన్నాడ గ్రామాల్లో ఎస్‌డబ్ల్యూ పీసీ కేంద్రాల నిర్మాణం జరగలేదు. దాంతో చెత్తను ఎక్కడబడితే అక్కడ రోడ్డు వెంబడి డంప్ చేస్తున్నారు. వాహనదారులకు ప్రజలకు ఇబ్బందులు కలుగుతుంది. చెత్తను అంటించడంతో పొగ రావడం ప్రయాణికులు ఇబ్బందులు పడటం, కాలుష్యం వెదజల్లడం జరుగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**పంపిణీకి నోచుకోని చెత్తబుట్టలు**

ప్రతి ఇంటి వద్ద తడి, పొడి చెత్త వేరువేరుగా వేయడానికి గత ప్రభుత్వం మండలానికి సుమారు 80వేల అందజేసింది. కొన్నిచోట్ల చెత్త టబ్‌లు అందజేశారు. ఎన్నికల కోడ్ రావడంతో వాటిని పంపిణీ చేయకుండా సచివాలయాల్లో ఇప్పటికీ పంపిణీకి నోచుకోలేదు.

### చెత్తను గుర్తొచ్చినప్పుడు తీసుకెళ్తున్నారు



చెత్తను ప్రతిరోజు తీసుకువెళ్లాలి. అప్పుడప్పుడు గుర్తొచ్చినప్పుడు తీసుకెళ్తున్నారు. తడి, పొడి చెత్త వేరుచేసి ఎరువులు తయారు చేస్తానన్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా ఈ సంపద కేంద్రాలు ఉంటే బాగుంటుంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కురుకుంటి పౌలు, కుముదవల్లి

### మా ఏరియాకి చెత్త బండి రావడం లేదు



మేజర్ పంచాయతీ మా గ్రామంలో చెత్తను తీసుకెళ్లడానికి పంచాయతీ సిబ్బంది రావడం లేదు. రోడ్ల వెంబడి చెత్తను పడేస్తున్నారు. ప్రయాణించాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. డంపింగ్ యార్డ్ నిర్మాణం చేసి అక్కడికి తరలించాలి.

– కె ఏసురత్నం, మోగల్లు

### త్వరలో చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తెస్తాం

మండలంలో 14 గ్రామాలకు గాను 11 గ్రామాల్లో ఎస్ డబ్ల్యూ పీసీ కేంద్రాలను నిర్మాణం చేయడం జరిగింది. కొన్ని కేంద్రాల్లో తడి, పొడి చెత్త వేరు చేసి వర్మి కంపోస్టు తయారుచేసి రైతులకు అందిస్తున్నాం. మిగతా కేంద్రాలను కూడా వినియోగంలోకి తెచ్చే చర్యలు చేపడతాం. మోగల్లు, పెన్నాడ, శృంగవృక్షం డంపింగ్ యార్డ్‌లో నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

– ఎం వి ఎస్ రాంప్రసాద్, ఈవోపీఆర్డీ, పాలకోడేరు.

## పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ

భీమవరం: మానవతా సంస్థ భీమవరం శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని ఏఆర్టీ సెంటర్‌లో శనివారం హెచ్‌ఐవి బాధిత కుటుంబాల పిల్లలకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ బుద్ధరాజు వెంకటపతి రాజు మాట్లాడుతూ ప్రతినెల రెండవ శనివారం 30 మంది హెచ్‌ఐవి బాధిత కుటుంబాల పిల్లలకు, పెద్దలకు తమ సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహారంగా డ్రై ఫ్రూట్స్, వంటనూనె, నిత్యావసర సరుకులు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు చింతలపాటి రామకృష్ణంరాజు, ఉపాధ్యక్షుడు ఎస్ఎస్ఎస్ రాజు, ఆకుల మౌనిక మనోహర్, కట్రెడ్డి పెద్దిరాజు, ఇందుకూరి శివాజీ వర్మ, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని బాంబే స్వీట్స్ కూడలిలోని గాంధీజీ విగ్రహం వద్ద దాత పొత్తూరి బాపిరాజు చేపట్టిన అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహం ప్రాంగణంలో లాన్, మొక్కలు ఏర్పాటు, వాటర్ ఫౌంటెన్, పెయింటింగ్, బ్యాక్ డ్రాప్ పనులపై ఆరా తీశారు. ఆగస్టు 15 నాటికి చేపట్టిన పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాంబే సీట్స్ యాజమాన్యం దాత పోతూరి బాపిరాజు, తదితరులు ఉన్నారు.

## వేంకన్నకు ప్రత్యేక పూజలు

యలమంచిలి: కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామికి శ్రావణ పౌర్ణమి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అబ్బిరాజుపాలెం గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆషాఢ శుద్ధ ఏకాదశి నుంచి ఆలయంలో చాతుర్మాస పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు భక్తులందరికీ తీర్థ ప్రసాద వితరణ చేశారు.

# గుంతలు పూడ్చండి..చింతలు తీర్చండి

**కాళ్లలో రాష్ట్రీయ రహదారిపై ఏర్పడ్డ గొయ్యిలో పడిపోతున్న వాహనదారులు**



గోతిలో బోల్తా పడిన చెత్త సేకరించే వాహనం



భారీ గోతిలో వాహనంతో ఇబ్బంది పడుతున్న వాహనదారుడు

కాళ్ల: మండలంలోని రహదారులు ప్రమాదకరంగా మారాయి. నిత్యం వందలాది వాహనాలు వెళ్లే రహదారిపై ఏర్పడ్డ గొయ్యిలో పడి పదులసంఖ్యలో వాహనదారులు గాయాలపాలవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కాళ్ల గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అధికారుల నిర్లక్ష్యంతో భారీ గోతిలో ప్రయాణికులు పడరాని అగచాట్లు పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే మండల కేంద్రమైన కాళ్లలో హైస్కూల్ దాటిన తర్వాత బ్రాందీ షాపు సమీపంలో రాష్ట్రీయ రహదారిపై ఏర్పడ్డ గొయ్యి అధికారులు పట్టించుకోకపోవడంతో రోజురోజుకూ పెద్దగా మారి ప్రమాదాలకు నిలయంగా మారింది.అంతే కాకుండా టరినింగ్ కావడంతో ఈగొయ్యిలో ప్రస్తుత వర్షాలకు నీరు చేరడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. శనివారం ఉదయం కురిసిన భారీ వర్షానికి పంచాయతీ చెత్తసేకరణ చేసే వాహనంతో పాటు పలు వాహనాలు గోతిలో పడిపోయాయి. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే వరకు పట్టించుకోరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రహదారిపై ఏర్పడ్డ గొయ్యిని పూడ్చే ఏర్పాట్లు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

## అలరించిన భువన విజయం



స్థానిక ఆర్యవైశ్య కల్యాణమందిరంలో నిర్వహించిన భువన విజయం సాహితీ కార్యక్రమం

ఆకివీడు: సంస్కృతీ సాంప్రదాయాల్ని, తెలుగు భాషా ఔనత్యాన్ని సాటే భువన విజయం సాహితీ రూపకం కళాభిమానుల్ని విశేషంగా ఆకట్టుకుంది. స్థానిక ఆర్య వైశ్య కల్యాణ మందిరంలో హైందవ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలనను మోటుపల్లి రామవరప్రసాద్, కాకర్ల రాజరాజేశ్వరి, బొల్లా వెంకట్రావులు, ఓలేటి శ్రీనివాస్‌లు చేశారు. కవులు, పండితులు శ్రీకృష్ణ దేవరాయుల సాహితీ సమరాంగణంలో అష్టదిగ్గజాలు ప్రదర్శించిన పాత్రలు పలువుర్ని ఆకట్టుకున్నాయి. శ్రీకృష్ణ దేవరాయులు పాత్రలో మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, అల్లసాని పెద్దన్న, నంది తిమ్మన, ధూర్జటి, మల్లన్న, పింగళి సూరన్న, తెనాలి రామకృష్ణుడు,రామభ్రుడు, భట్టుమూర్తిల పాత్రలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. తొలుత కార్యక్రమాన్ని ఉద్దేశించి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలు, విశ్రాంతి ఉపాధ్యాయురాలు కాకర్ల రాజరాజేశ్వరి మాట్లాడుతూ తెలుగు భాష ఔనత్యాన్ని సాటే విధంగా భువన విజయం ఉంటుందన్నారు. మాతృభాష ప్రావీణ్యాన్ని మరింత ముందుకు తీసుకువెళ్ళే ప్రయత్నంలో భువన విజయం కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు.

# ఆప్యాయతకు ప్రతీక రక్షాబంధన్



భీమవరంలో మోషేనురాజుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారిలు



రాయకుదురులో సోదరులకు రాఖీలు కడుతున్న సోదరీమణులు



చిల్డ్రన్‌హోమ్‌లో రాఖీపౌర్ణమి వేడుక దృశ్యం

భీమవరం: రాఖీపౌర్ణమి పండుగను పురస్కరించుకుని శనివారం భీమవరం పట్టణంలోని పలువురు ప్రజాప్రతినిధుల, అధికారులకు బ్రహ్మకుమారిలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజును పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కలిసి రాఖీకట్టి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తదితరులకు రాఖీలు కట్టారు. అలాగే పట్టణంలోని విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో చినఅమిరం గ్రామంలోని ఇమ్మానియేల్ చిల్డ్రన్ హోమ్‌లో శనివారం రాఖీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యూ ఆంధ్ర బాడీబిల్డర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాసీం, అల్లు శ్రీనివాస్, ఎస్‌కే చాన్‌బాషా, హరినాథరాజు, మోటేపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**వీరవాసరంలో...**

వీరవాసరం: రక్షాబంధన్‌ను పురస్కరించుకుని వీరవాసరం మండలంలోని ప్రతి గ్రామంలోనూ ప్రతి ఇంట రాఖీ పౌర్ణమి వేడుకలు శనివారం నిర్వహించారు. అక్క, చెల్లెల్లు అంతా కలిసి వారి తమ్ముళ్లు, అన్నలకు రాఖీలను కట్టి దీవెనలు తీసుకున్నారు. ఒకరికొకరు తోడునీడగా ఉంటామంటూ భరోసానిచ్చుకుంటూ స్వీట్లు తినిపించుకున్నారు. సోదర, సోదరీమణుల మధ్య రక్షాబంధన్ కార్యక్రమం ప్రేమ, గౌరవం, ఆప్యాయత, అనురాగాలను పెంపొందిస్తుందని పలువురు పేర్కొన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు.



# వేద పండితులకు హెల్మెట్‌ల పంపిణీ



స్థానిక దత్త క్షేత్రంలో వేద పండితులకు హెల్మెట్‌లు పంపిణీ చేస్తున్న దృశ్యం.

ఆకివీడు: వేదాలు వల్లిస్తూ మన సంస్కృతీ సాంప్రదాయాల్ని కాపాడుతున్న వేద పండితుల రక్షణ కోసం హెల్మెట్‌లు అందజేయడం అభినందనీయమని మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్ అన్నారు. స్థానిక దత్త క్షేత్రంలో శనివారం జంధ్యాల పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శాంతి హోమం నిర్వహించారు. వేద పారాయణం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, ఆలయ గౌరవ అధ్యక్షుడు నంద్యాల సీతా రామయ్య మాట్లాడుతూ ఆధ్యాత్మికంగా దత్తక్షేత్రంలో పలు కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో 100 మంది వేద పండితులకు హెల్మెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌పీ గ్యాస్ ఉమ్మడి జిల్లా సేల్స్ మేనేజర్ వెంకటేశ్వర్లు, దత్త క్షేత్ర కార్యదర్శి కంభంపాటి త్రినాథ కృష్ణమూర్తి, మహిళలు పాల్గొన్నారు.

## కారుమూరి పరామర్శలు



సుబ్బరాజును పరామర్శిస్తున్న కారుమూరి, వెంకటరాయుడు

భీమవరం: భీమవరం పట్టణానికి చెందిన పారిశ్రామికవేత్త గాదిరాజు సుబ్బరాజును మాజీ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వర రావు పరామర్శించారు. సుబ్బరాజు తండ్రి వెంకట్రాజు ఇటీవల మృతి చెందడంతో శనివారం మాజీ మంత్రి నాగేశ్వరరావు ఏఎస్ ఆర్ నగర్‌లో సుబ్బరాజును కలిసి పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయు, పార్టీ భీమవరం పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, మాజీ ఎంపీటీసీ పెనుమాల నర్సింహస్వామి తదితరులున్నారు.

## రామలింగేశ్వరుని సన్నిధిలో చండీహోమం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాసం పౌర్ణమి సందర్భంగా శనివారం చండీహోమం నిర్వహించారు. ఆలయ అభిషేక పండితుడు భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో నిర్వహించిన ఈ హోమంలో 24 మంది దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు స్వామి వారి శేషవస్త్రం , అమ్మవారి జాకెట్ ముక్కలు, ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాస్, సూపరింటెండెంట్ పసుపులేటి వాసు, ఆలయ ప్రధానార్చకుడు అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని కాపవరం గ్రామం శివారు చింతలపాలెంలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. శనివారం పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు మండలంలో తనిఖీలు చేయగా చింతలపాలెంలో ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు గుర్తించామన్నారు. పేకాట శిబిరంపై దాడి చేయగా వారి నుండి రూ. 3080 లు నగదు దొరికినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి సురేంద్రకుమార్ తెలిపారు.